## నేడు బల్దియాలో గ్రీవెన్స్

వరంగల్, మార్చి 9: మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు నగర ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. గ్రీవెన్స్ అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మార్చి 9 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ డీఈ జీ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా సోమవారం బాలసముద్రం సబ్ స్టేషన్ అడ్వకేట్స్ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని అడ్వకేట్స్ కాలనీ, హంటర్‌రోడ్డు, వరంగల్ పబ్లిక్ స్కూల్ ఏరియాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

## సెమినార్ హాల్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, మార్చి 9 : కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగంలో పూర్వవిద్యార్థులు సొంత నిధులతో ఏర్పాటు చేసిన అల్యూమిని సెమినార్ హాల్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్, ప్రొఫెసర్ జీ వీరన్న, కే రఘురాంరెడ్డి, హరి ప్రసాద్, వడ్లకొండ సత్యనారాయణ, నాగరాజు వాడపల్లి, సారంగపాణి, ఇండ్ల నాగేశ్వరరావు, చిర్ర రాజు పాల్గొన్నారు.

## పెళ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య



రమ్య (ఫైల్)

ఎల్కతుర్తి, మార్చి 9: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి బొంత కుమారస్వామికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్న కూతురు బొంత రమ్య(22)కు ఇటీవల సంబంధాలు చూస్తున్నారు. అయితే ఏవి కుదరడం లేదు. దీంతో తరచూ పెళ్లి కాదేమోనని తల్లిదండ్రులకు చెప్పుకుంటూ బాధపడేది. ఈ క్రమంలోనే ఈ నెల 7న మనస్తాపంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు చేతులెత్తేయడంతో తిరిగి ఎంజీఎం తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున రమ్య మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# కాకతీయుల పాలనలో వీరగాథలు మహిళలవే..

- వేయిస్తంభాల గుడి ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల ఆలయంలో మహిళలను సన్మానిస్తున్న ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ



హనుమకొండ : బాలసముద్రంలో వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో అనితారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 9: కాకతీయుల పాలలో వీర గాథలన్నీ మహిళలవేనని వేయిస్తంభాల ఆలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. 50వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రక వేయిస్తంభాల గుడిలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గంగు ఉపేంద్రశర్మ పాల్గొని మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పది రోజుల పాటు జరుపుకోవాలని కేంద్ర పురావస్తు మంత్రిత్వ శాఖ నిర్ణయించిందన్నారు. స్త్రీ త్యాగాలే మనం అనుభవిస్తున్న ప్రస్తుత స్వాతంత్ర్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం పది రోజుల వేడుకల్లో మొదటి కార్యక్రమాన్ని వేయిస్తంభాల గుడిలో నిర్వహించిందని, సోమవారం నుంచి చార్మినార్, గోల్కొండ కోట, తదితర ప్రదేశాల్లో జరుపుకోనున్నట్లు ఏఎస్ఐ ఇన్‌చార్జి సీఐ మల్లేశం తెలిపారు. కాగా, సంగీత ఉపాధ్యాయురాలు వద్దిరాజు నివేదిత స్వాగత గేయం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం నృత్యగురువు తాడూరి రేణుక, కూచిపూడి కళాకారులు వెంపటి శ్రావణి, డీ ఝాన్సీ, కుండే అరుణా రాజ్‌కుమార్, సంగీత శిక్షకులు వద్దిరాజు నివేదిత, ఉపాధ్యాయురాళ్లు తిరుమలగిరి పద్మ, బాలబోయిన రమాదేవి, మెరుగు అనురాధ, నల్ల మాధవి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు బండారి సుజాత, రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్ రమా రత్నమాల, దేవాదాయ శాఖ సిబ్బంది బైరి రజిత, లంక సుజాత, కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది సవిత, చంద్రకళ తదితర 16 మంది మహిళలను శాలువాతో ఘనంగా సత్కరించారు.

**బాలసముద్రంలో..**

హనుమకొండ : వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన బాలసముద్రంలోని కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నేషనల్ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి ఆదేశాల మేరకు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనురాగ్ హెల్పింగ్ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి, గౌరవ అతిథిగా సౌతిండియా చైర్మన్ డాక్టర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మహిళా సాధికారత గురించి పలువురు ప్రసంగించారు. వివిధ రంగాల్లో విశేష కృషి, వినియోగదారుల రక్షణ చట్టంపై విస్తృత స్థాయిలో పని చేసిన మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థ బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కేశవరెడ్డి, రత్నమాల, సుజాత, అంజనీదేవి సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.

## మరిచిపోయిన బ్యాగు అప్పగింత



బ్యాగును అందజేస్తున్న సీఐ రవి కుమార్

నయీంనగర్, మార్చి 9 : ఆటోలో మరిచిపోయిన బ్యాగును గంటలోనే పట్టుకుని కేయూ పోలీసులు బాధితురాలికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నునావత్ శారద భీమారం నుంచి కేయూ వైపు ఆటోలో వెళ్తున్న క్రమంలో కేయూ క్రాస్ రోడ్డు వద్ద బ్యాగును మర్చిపోయింది. వెంటనే ఆమె కేయూ పోలీస్ స్టేషన్‌లో ఆ బ్యాగులో బంగారు ఆభరణాలు ఉన్నాయని ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పోలీసులు ఆటో డ్రైవర్‌ను దొరకపట్టారు. బ్యాగును స్వాధీనం చేసుకుని సీఐ రవి కుమార్ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. బ్యాగు దొరకడంలో ప్రతిభ చూపిన ఏఎస్సై లాయక్ అలీ ఖాన్, సుధాకర్, లహరి, మానసను సీఐ అభినందించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం జిల్లా కోకన్వీనర్‌గా భాస్కర్



మడికొండ, మార్చి 9 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం జిల్లా కోకన్వీనర్‌గా మడికొండకు చెందిన కొలిపాక భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి నియామక పత్రాన్ని అందజేశారు. ఉద్యమ సమయంలో ధూంధాం ఆటపాటలతో సాంస్కృతిక కళా ప్రదర్శనల్లో భాస్కర్ చురుగ్గా పాల్గొని ప్రజలను చైతన్యం చేసినందుకు, ఆయనను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ పూర్వవిద్యార్థులు

## పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి కృషి చేయాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 9 : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి కృషి చేయాలని పూర్వవిద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు టీఎన్ స్వామి అన్నారు. ఆదివారం కాలేజీ ప్రాంగణంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా పూర్తిస్థాయి కమిటీని ఈనెల 23న జరిగే జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అప్పటి వరకు పూర్వ విద్యార్థులందరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. వివిధ పదవులకు ఆసక్తిగలవారు తమ పేర్లను అడ్‌హక్ కమిటీ వద్ద నమోదు చేసుకోవాలన్నారు. అడ్‌హక్ కమిటీని కన్వీనర్ ఈవీ శ్రీనివాస్‌రావుతో పాటు 18 మంది సభ్యుల సమక్షంలో నియమించామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఎల్లయ్య, మధుసూదన్ రావు, శంకర్, మేకల అక్షయ్ కుమార్, మురళీధర్, భిక్షపతి, మహేందర్, కుమార్, సతీశ్‌రెడ్డి, ఈ శ్రీనివాస్, వసంత్ కుమార్, అజయ్, రాజ్ కుమార్, విఘ్నేశ్, వెంకన్న, శ్రీకాంత్, మనిష్ పాల్గొన్నారు.

## ఆర్చి పిల్లర్ లారీ మీద పడి డ్రైవర్ మృతి



అనిల్(ఫైల్)

ధర్మసాగర్, మార్చి 9 : ప్రమాదవశాత్తు ఆర్చి పిల్లర్ లారీ మీద పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన చేపూరి అనిల్(32) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వృత్తి రీత్యా ఎలుకుర్తి గ్రామ పరిధిలో ఓ వెంచర్‌లోకి లారీ నడుపుతున్న క్రమంలో ఆ వెంచర్ ద్వారం వద్ద ఉన్న ఆర్చి పిల్లర్ ఒక్కసారిగా కూలి లారీపై పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మసాగర్ సీఐ ప్రవీణ్ కుమార్ ఘటనా స్థలానికి పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు భార్య ఉన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కాజీపేట, మార్చి 9 : దక్షిణ మధ్య రైల్వే తెలుగు మీడియం పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు కాజీపేట శివారు ఐశ్వర్య కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. చిన్ననాటి మిత్రులను 25 ఏళ్ల తర్వాత కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో నాడు విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించి, పాదాభిషేకం చేశారు. కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం కుటుంబరావు, ఉపాధ్యాయులు వీరభద్రయ్య, మాధవరావు, హరగోపాల్, దుర్గాప్రసాద్, శరత్‌బాబు, వాసు, వెంకట్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, అజయ్ మిశ్రా, తిరుపతి నాయుడు, శ్రీధర్, కేదారేశ్వరి, నిరంజన, మిరియం శోభ భద్రే, కమలాకుమారి, ప్రేమలత, అరుణ, కమ్రున్నీసా బేగం, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలి

**గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**



పన్ను చెల్లింపుదారుడికి రసీదు అందజేస్తున్న కమిషనర్ వాకడే

వరంగల్, మార్చి 9 : పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. నగరంలో ఆదివారం ఆమె పన్ను వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్‌బీఐ కాలనీ, టీఎన్జీవోస్‌కాలనీలో పర్యటించారు. పన్నులు చెల్లించని కమర్షియల్, రెసిడెన్షియల్ యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అయినా స్పందించని యాజమాన్యాల ఆస్తులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పన్ను వసూలు చేసే సిబ్బంది నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. దీంతోపాటు ట్రేడ్ లైసెన్స్, ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పనితీరును కమిషనర్ పరిశీలించారు. కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లను తెలుసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న షాపుల ఫెనాల్టీలను పరిశీలించారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పని చేయాలన్నారు. తనిఖీల్లో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్‌వో యూసుఫొద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఆర్ఐ నవనీత్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్, జవాన్లు పాల్గొన్నారు.

# 'రాజ్యాంగ నిర్మాతను గౌరవించుకోవాలి'



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బండి అశోక్

హనుమకొండ చౌరస్తా, మార్చి 9 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకొని భారత రాజ్యాంగ నిర్మాతను గౌరవించుకోవాలని అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ బండి అశోక్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి, జ్ఞానమాలాంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి గ్రేటర్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహాల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పోతుల కొమ్మాలు, వంగేటి రాజమౌళి, శేషాద్రి నాగులు, అంబేద్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, సింగారపు రవిప్రసాద్, దండ్రి శ్రీనివాస్, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, పీ రమేశ్, తుప్పరి రంజిత్, మేడ యాదగిరి, జక్కుల నర్సింహ, గుత్తికొండ నర్సయ్య, మంద కుమార్, బుజుగుండ్ల అనిల్, పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాజీపేటలో వ్యక్తి మృతదేహం

కాజీపేట, మార్చి 9 : కాజీపేట రైల్వే ఎలక్ట్రికల్ లోకో షెడ్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం గుర్తించారు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి వివరాల ప్రకారం.. ఈఎల్ఎస్ షెడ్డు సమీపంలో వ్యక్తి చనిపోయి ఉన్నట్లు సమాచారం రావడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు 40–45 ఏండ్ల మధ్య వయసు కలిగి, 5.6 అడుగల ఎత్తు, నల్లని జుట్టు, తెల్లని గడ్డం కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. అనారోగ్యంతో చనిపోయినట్లు ఆనవాలు కనిపిస్తున్నాయన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధీకులు, బంధువులు ఉంటే కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

నయీంనగర్, మార్చి 9 : కోమటిపల్లి తండాలో 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. వివరాల ప్రకారం.. కోమటిపల్లి తండాకు చెందిన మాలోత్ రమాదేవి, మాలోత్ రవి రూ.లక్ష విలువ చేసే 40 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ నిల్వ చేశారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. బియ్యం సీజ్ చేసి, కేయూ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# కాజీపేటలో 14 కిలోల గంజాయి పట్టివేత

**ఒకరి అరెస్ట్, రిమాండ్**



పట్టుకున్న గంజాయి, రవాణాదారుడు రమేశ్ నాయక్‌ను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట, మార్చి 9 : కాజీపేటలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి 14 కిలోల గంజాయిని పట్టుకుని, రవాణారుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ కథనం ప్రకారం.. రాష్ట్ర ఎక్సైజ్ ఈడీ ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు కాజీపేటలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వే స్టేడియం ప్రాంతంలో ఓ వ్యక్తి బ్యాగులతో అనుమానంగా కనిపించాడు. ఎక్సైజ్ ఎస్సై తిరుపతి సిబ్బందితో అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో అతడిని ఎక్సైజ్ స్టేషన్ తరలించి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. విచారణలో అతడు ఒడిశా రాష్ట్రానికి చెందిన రమేశ్ నాయక్‌గా గుర్తించారు. ఏపీలోని ఇచ్ఛాపురంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద 14 కిలోల గంజాయిని కొనుగోలు చేసి పూణేకు రైలులో తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. కాజీపేటలో రైలులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా గమనించి కిందికి దిగి ఎవరికీ అనుమానం రాకుండా బయటికి వచ్చాడు. తనిఖీల అనంతరం వేరే రైలులో పూణేకు వెళ్లేందుకు పథకం వేసుకుని కాజీపేట రైల్వే పరిసరాల్లో తిరుగుతుండగా పోలీసులు అతడిని పట్టుకున్నారు. గంజాయి విలువ రూ.3.75లక్షలు ఉంటుందని, దాన్ని సీజ్ చేసి, రమేశ్ నాయక్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై తిరుపతి, సిబ్బంది ఖలీల్, రవీందర్, పృథ్వీ, లాలయ్య, అయూబ్ పాల్గొన్నారు.

# మాదిగలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి

- ఎమ్మెస్పీ జాతీయ నేత మంద కుమార్
- ఏకశిలా పార్కు వద్ద రిలే దీక్షలు ప్రారంభం



హనుమకొండ : దీక్షలను ప్రారంభిస్తున్న మంద కుమార్ మాదిగ

హనుమకొండ, మార్చి 9 : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, అమలు చేసే వరకూ అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందని ఎమ్మెస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ అన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్ 1 , 2 , 3, హెచ్‌డబ్ల్యూవో, ఎక్సటెన్షన్ ఆఫీసర్ జాబ్స్ ఫలితాలు విడుదల చేస్తామని టీజీఎస్‌పీఎస్‌సీ ప్రకటించడాన్ని నిరసిస్తూ మంద కృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ఎదుట ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మంద కుమార్ ప్రారంభించి, మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ విషయంలో ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ఆధారంగా చట్టబద్ధత కల్పించకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేస్తూ మాదిగలను ప్రభుత్వం మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా త్వరగా వర్గీకరణ అమలు చేయకుండా జాప్యం చేస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్న దినేశ్ మాదిగ, జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, బండారి సురేందర్ మాదిగ, మంద చిన్న రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మసాగర్‌లో..**

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, నాయకులు పుట్ట ప్రశాంత్, మాచెర్ల బాబు, చిలుక రాజు, రమణాకర్, శంకర్, ప్రదీప్, ప్రణయ్, చైతన్య, స్వామి, అభిషేక్, ప్రవీణ్, సంపత్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

**దామెరలో..**

దామెర : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో పాలకవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నాయకులు వేల్పుల శ్రీను, కుమార్, యాకూబ్, జైపాల్, శ్రీను పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట్‌రెడ్డి, కవులు

## 'శిలాక్షర' సమాజానికి గొప్ప సందేశం

పోచమ్మమైదాన్, మార్చి 9: శిలాక్షర కవిత్వం శిల్పం చెక్కిన అక్షరాలతో సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండలో సామా జగన్మోహన్‌రెడ్డి స్మారక నిలయంలో జాతీయ పరిషత్, దేవగిరిపట్నం పరివార్ ఆధ్వర్యంలో గన్నోజ్ ప్రసాద్ రాసిన శిలాక్షరం అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. తాడిచెర్ల రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శిలాక్షరం కవిత్వంలో గాథా సప్తశతి, సకల నీతి కథం సంగ్రహం కావ్యాల్లో కవిత్వం దాగి ఉందన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ద్వారా సమాజ సంస్కరణ కవిత్వాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తిల శ్రీనివాస్, గడ్డం లక్ష్మణ్, బొంపెల్లి దిలీప్‌రావు, మీరు అనురాధ, చిలకమర్రి సంజీవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాక్షర కవిత్వాన్ని డీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దొడ్డ ప్రతాప్‌రెడ్డికి అంకితం చేశారు.



దుకాణాన్ని సీజ్ చేస్తున్న బల్దియా అధికారులు

## పన్ను చెల్లించని రెండు షాపులు సీజ్

వరంగల్, మార్చి 9: సుదీర్ఘకాలంగా పన్నులు చెల్లించని రెండు దుకాణాలను సీజ్ చేసినట్లు కాశీబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. ఆదివారం గోపాలస్వామి గుడి, పాపయ్యపేట చమన్ ప్రాంతంలోని రెండు షాపులను సీజ్ చేశామన్నారు. అనేకసార్లు నోటీసులు ఇచ్చామని, రెడ్ నోటీసు ఇచ్చినా స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌వో షహజాదీబేగం, ఆర్ఐ విజయకుమార్, వార్డు అధికారి, బిల్‌కలెక్టర్ పాల్గొన్నారు.

## అఖిల గాండ్ల తెలికుల సంఘం అభివృద్ధికి కృషి : ఎంపీ కావ్య



మాట్లాడుతున్న ఎంపీ కావ్య

ధర్మసాగర్, మార్చి 9: అఖిల గాండ్ల తెలికుల సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అఖిల గాండ్ల తెలికుల సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు జక్కం సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గాండ్ల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ, మహిళా ట్రెజరర్ పుష్పలత, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి శివ పాల్గొన్నారు.



మధుసూదన్‌ను అభినందిస్తున్న నాయకులు

## టీఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా సామల మధుసూదన్

శాయంపేట,మార్చి 9 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం(టీఆర్‌పీఎస్) మండల అధ్యక్షుడిగా కొప్పుల గ్రామానికి చెందిన సామల మధుసూదన్ ఎన్నికయ్యారు. శాయంపేటలోని చేనేత సహకారం సంఘంలో ఆదివారం సంఘం ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చందా మల్లయ్య ప్రకటించారు. అనంతరం మధుసూదన్ తన మద్దతు దారులతో బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, సంబురాలు జరుపుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, నూతన అధ్యక్షుడికి రాష్ట్ర సలహాదారుడు బాసాని చంద్రప్రకాశ్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు బిల్లా యాదగిరి, మండల నాయకులు శాలువా కప్పి సన్మానించారు.





చేనేత సంఘం వద్ద మాట్లాడుతున్న సాంబయ్య

## మండల ఎన్నికను బహిష్కరిస్తున్నాం

శాయంపేట, మార్చి 9 : శాయంపేట మండల పద్మశాలి సంఘం ఎన్నికను బహిష్కరిస్తున్నామని అధ్యక్ష పదవి పోటీలో నిలిచిన అభ్యర్థి వంగరి సాంబయ్య అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ సంఘం ఎన్నికను పూర్తిగా ఏకపక్షంగా జిల్లా నాయకత్వం ఎన్నికల పరిశీలకుడు అభ్యర్థి మధుసూదన్‌తో కుమ్మక్కై నిర్వహించారని ఆరోపించారు. టీఆర్‌పీఎస్‌తో శాయంపేట గ్రామానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. శాయంపేట పద్మశాలి యువకులు సమస్యలను సమష్టిగా పరిష్కరించుకుంటామని తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన వారికి సాంబయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## ఎండిపోతున్న పంటల పరిశీలన

ఎల్కతుర్తి, మార్చి 9 : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో నీళ్లు లేక ఎండిపోతున్న పంటలను ఆదివారం సీపీఐ నాయకులు పరిశీలించారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి ఒక్కో ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టారని, తీరా చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. బావులు, బోర్లల్లో నీళ్లు అడుగంటి పోవడం వల్ల పంటలకు నీళ్లు అందడం లేదని, దేవాదుల కాల్వ ద్వారా కింద ఉన్న గ్రామాలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రె లక్ష్మణ్, జూపాక సదానందం, సాంబమూర్తి, సదానందం తదితరులు పాల్గొన్నారు.